# కొత్త రచయితలు

# లవ్ స్టోరి

"వేదనే కదా, ప్రేమను కొలిచే థర్మామీటరు"

రాత్రిని వయొలిన్‌లా మార్చుకుని, డాబాపైన ఇద్దరికే పరిమితమైన 'జుగల్ బందీ' కచేరీలో పేరు తెలియని రాగాలెన్నింటినో, మంద్రంగా మనోహరంగా పలవరిస్తున్న వేళ, హఠాత్తుగా "నీకెవరైనా గర్ల్ ఫ్రెండ్స్ ఉన్నారా?" అంది ఆమె.

ఇద్దరం దంపతులము కాక పూర్వం సన్నిహితులమైన నేస్తాలము కూడా. అయినా తను స్పృశించని నా గతంలో ఎక్కడైనా, ఎవరైనా ఉన్నారేమో అనే అనుమానం. తీవ్రమైన 'ప్రేమ' వ్యాధి గ్రస్తుల్లో తరచు ఈ లక్షణం కనిపిస్తూనే వుంటుంది. ఆ వెన్నెల రాత్రివేళ "నా ప్రేమ పుస్తకం అంతటా నీ జ్ఞాపకాల కవితలే కదా వందలు వేలుగా నేను వ్రాసుకుంది" అని ఓ కొటేషన్ వదిలి వుంటే, కథ వేరేలా వుండేది. కానీ తనను ఉడికించాలని 'సరళ' అనే అజ్ఞాత నాయికను, ఒక ఉత్తుత్తి ప్రేమ కథను సృష్టించాను. వ్యాధి కన్నా మందు డోస్ ఎక్కువైన, కష్టాలు, కన్నీళ్లు ఏర్పడిన ఆ కథా విధానం ఇట్టిదన......

ఒకప్పుడో సరళ వుండేది. ఆ సరళ ఫోర్తియర్ మెడిసిన్ చదువుతుండేది. సరళకు చారడేసి కళ్ళు, పొడవుగా పొగరుగా వుండే ముక్కు. కోలముఖం వుండేవి. ఎప్పుడు కలిసినా పికాసో, డాలి, అమృతాషేర్‌గిల్, నందలాల్ బోస్ అంటుండేది. క్లాసులో వెనక బల్లలపై కూర్చుని బొమ్మలు గీసుకుంటూ వుండేది. బస్ స్టాపుల్లోనూ, హాస్పటల్ వార్డుల్లోనూ ఏదో దృశ్యాన్ని స్కెచ్‌గా మలుస్తూ ప్రత్యక్షమయ్యేది. తల్లి సరస్వతి గాఢ నిద్రలో వుండగా బ్రహ్మ రహస్యంగా అపురూపంగా వేసుకున్న చిత్రం ఈ పిల్ల అంటుండేవాళ్ళు కాలేజీ పిల్లలు. ఆ సరళ నా క్లాస్‌మేటు. అదుగో అంతవరకే నిజం. ఆ నిజానికి అద్భుతమైన ఫాంటసీ జోడించి "మెడికల్ కాలేజిలో బొమ్మలు, కవిత్వం అంటూ కాలక్షేపం చేసే వాళ్ళము కొద్దిమందే వుంటాము. మెడికల్ ఎగ్జిబిషన్‌కు సన్నాహాలు జరిగే రోజుల్లో నన్నూ, సరళనూ పిలిచి ఎద్దైనా మంచి క్రియేటివ్ వర్క్ ఒకటి తయారు చెయ్యండోయ్ అంటూ పురమాయించాడు మా ప్రొఫెసరు. ఇద్దరము కలిసి ఒక అద్భుతమైన **'Puppet Show'**ని తయారు చేశాము. రాత్రి పన్నెండు దాకా ఆడిటోరియంలో బొమ్మలు వేస్తూ, స్క్రిప్టు రాస్తూ, టీ నీళ్ళు సిప్ చేస్తూ, కబుర్లు కుప్పలు పోసుకుంటూ గడిపేవాళ్ళం. 'పప్పెట్ షో'కి బెస్ట్ ఐటమ్‌గా అవార్డు వచ్చింది. ఆ థ్రిల్‌లో పరవశించిన నాకు ఒక అనూహ్యమైన గిఫ్ట్ ఇచ్చింది సరళ. తన సన్నని గులాబీ రంగు పెదవులతో నా బుగ్గలపై రెండు చంద్రవంకలు చిత్రించి "ఇది హృదయ పూర్వకమైన కానుక అంది.

సన్నటి వెక్కిళ్ళు వినిపించి 'కథ' ఆపేశాము. బెడ్‌పై చల్లగా, తడిగా... గాడ్!

రచయిత్రి చిరునామా:
కిన్నెర ప్రసూన
కేరాఫ్ బి. గురుమూర్తి
షాప్ నెం: 14-4-215
మూర్తి రాజు బిల్డింగ్స్
పొత్తూరు వారి తోట
గుంటూరు-522 001


తను ఏడుస్తూంది. బ్రతిమాలి, చెంపలువేసుకుని అంతా 'గ్యాస్' అని చెప్పి తనను ఓదార్చాను గానీ, ఆవార్తి ఆ మాటలు తన జ్ఞాపకాల స్టోర్ హౌస్‌లో సన్నని నిప్పు కణికల్లా దాగి వుంటాయని నేను అనుకోలేక పోయేను.

ఓ పత్రిక నడిపిన కథల పోటీలో రెండో బహుమతి వచ్చింది నా కథకు. ఆరు నెలల తరువాత ముచ్చట ఇది. ఆనందం, ఉల్లాసం, కేరింతలు. ఇల్లంతా ఫెస్టివ్ మూడ్‌తో కళకళలాడింది. కథ ఇద్దరు డాక్టర్ల గురించి. ఒక ఆదర్శాల లేడీ డాక్టరు. ఇంకో ఫాలెన్ ఏంజిల్ లాంటి మేల్ డాక్టరు. లేడీ డాక్టరు పేరు సరళ. శ్రీమతి కథ చదివిన రెండు మూడు నిమిషాలకే ఇంట్లో ఆనందపు బెలూన్ టప్‌మని పగిలి పోయింది. "మరపురాని ప్రేమ స్మృతుల్ని కథలుగా వ్రాస్తున్నావన్నమాట?" అంది. తను పెద్దగా అరవదు. కోపంగా చూడదు. అశ్రు పూరితమైన రుద్ధ కంఠంతో నిస్సహాయంగా జాలిగా రోదిస్తుంది. కత్తితో గుండెను సన్నగా తరుగుతున్నట్టుగా వుంటుంది ఆ రోదన.

రెండు రోజుల విషాద యోగం తరువాత ఇల్లు మళ్ళీ మామూలు వాతావరణంలోకి వచ్చింది.

వారం తిరక్కు ముందే సదరు సరళ ఒక సాయం కాలం మాయింట్లోనే ప్రత్యక్షమైంది. టి.వి.లో ఓ క్రూరమైన సీరియల్ రిలే అవుతూంది అప్పుడు. ఆ సీరియల్‌లోని (మగవాళ్ళ గురించిన) నెగిటివ్ మెసేజ్‌తో బుర్ర పాడయిన శ్రీమతికి ఇదో షాక్. సరళ **M.D.** రిజల్ట్స్ ఆ రోజే వచ్చాయి. క్లాస్‌మేట్స్ అందర్నీ పలకరిద్దామని వచ్చింది. స్వీట్సు బాక్స్‌తో సహా.

"పోస్ట్ ఎగ్జామ్ ఎలేషన్" గొప్పఅనుభూతి. అది మెడికల్ స్టూడెంట్స్ మాత్రమే అనుభవించగలరు. నెలల తరబడి కఠోర శ్రమ తరువాత కలిగే విముక్తి. ఆ ఆనందాన్ని పంచుకోవాలని సరళ ఆరాటం. నోటికి స్వీట్ అందిస్తూ తన బాల్యపు అనుభవాలు చెప్పేతూ, తుళ్ళుతూ కేరింతలాడుతూ. అనుమానాల పల్లవి సరళ రాకతో పెద్దపాటగా మారింది. ఆ తల్లి మంచి నేనూ నా శ్రీమతీ పక్క పక్కనే నడుస్తూ చూపులు కలుపుకోని బాటసారుల్లా గడిపేము వారంపాటు. మౌనం ద్వారా శిక్షించటమనే గొప్ప ఆర్టు ఆడవాళ్ళకే తెలుసు. వారం తరువాత ఇద్దరమూ మాటలు కలుపుకొన్నాం మళ్ళీ. కానీ ఆ మాటలు పంచదార లేని




పాయసంలా చప్పగా వుండేవి.

సరళకు పెళ్ళి సెటిల్ అయ్యింది. అమెరికాలో కార్డియాలజిస్టుగా ప్రాక్టీసు చేస్తున్నాడు వరుడు. సరళ పెళ్ళితోనయినా మా యింట్లో రేగిన తుఫాను ఆగిపోతుందని ఆశ పడ్డాను. పెళ్ళికి ఇన్విటేషన్ ఇస్తూ ఒక బుక్ కూడా ప్రజెంటు చేసింది సరళ. అది విశ్వనాథ వారి "కిన్నెరసాని". లోపలి పేజీలో "పువ్వులా పసిపాప నవ్వులా , పాలనురగలా, విశ్వమంతా నిండిన స్నేహ గీతంలా, నా ఎదపై చెరిగిపోనిబొమ్మలా కదలాడే జ్ఞాపకం నువ్వు" అంటూ వ్రాసింది. అదృష్టవశాత్తూ ఆ పుస్తకం హాస్పటల్లో వుండగా ఇచ్చింది.

ఆ రోజు నాకు ఒ.పి. డ్యూటీ బాగా ఆలస్యమయి, అలసి పోయి ఎప్పుడో రెండింటికి డ్యూటీ రూమ్‌కు చేరాను. రూమ్‌లో శ్రీమతి. బల్లపై కారేజి. శ్రీమతి చేతిలో "కిన్నెరసాని". తన ముఖంలో దిగులు, వేదన, విరసన. ఇక్కటితో ముగిసే ఈ "ముచ్చట"కు ఆ తరువాత ఐదారునెలలకు నా శ్రీమతి అన్న మాటలు ముక్తాయింపుగా వ్రాస్తున్నాను.

"నీలో పసిపాపల ఇన్నొసెన్స్ వుంది. కళ్ళ నిండా నిజాయితీ వుంది. నీకు ప్రేమించడమే తెలుసు కానీ కామించడము చేతకాదు. సరళ ఒట్టి జ్ఞాపకమేనని నాకు తెలుసు. నీ గుండె గోడపై వ్రేలాడేది నా 'పటమే' అని నాకు తెలుసు. అయినా విన్ను ఉడికించడం నా కిష్టం. నా అనుమానాన్నీ, దిగులునూ చూసి నువ్వు వేదన పడడం నాకిష్టం. ఎందుకంటే వేదనే కదా ప్రేమను కొలిచే థర్మామీటరు."

— రిత్విక్ ప్రబంధక్